'నీట్'ను రద్దు చేయాలి

■ లీకేజీ నిందితులను శిక్షించాలి ■ కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా

జనగామ చౌరస్తా, జూన్ 20: 'నీట్'ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జనగామ కలెక్టరేట్ ఎదుట సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్(రెవెన్యూ) రోహిత్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ నీట్‌పై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడమంటే విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడమే అన్నారు. పరీక్షను సక్రమంగా నిర్వహించలేని ఎన్‌టీఏను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాస్తే అందులో 65 మందికి 720/720 మార్కులు రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. పరీక్ష నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని సీపీఎం నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, బూడిద గోపి, ఉపేందర్, జోగు ప్రకాశ్, శేఖర్, నరేందర్, చందు, దడిగె సందీప్, ధర్మభిక్షం, కల్యాణి, లలిత, లింగం, బాల్నె వెంకటమల్లయ్య, అంజమ్మ, వరలక్ష్మి, మల్లేశ్ రాజ్, యాకన్న, ఉపేందర్, విఘ్నేశ్, సుమ, లవకుమార్, ఆర్య తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా నాయకులు

రేపు డిగ్రీ ప్రిన్సిపాళ్ల సమావేశం

హనుమకొండ చౌరస్తా, జూన్ 20 : కేయూ పరిధిలోని డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లతో శనివారం 22న ఉదయం 10.30 గంటలకు విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సర అల్మానాక్, కాలేజీల అనుబంధాలు, పరీక్షా షెడ్యూళ్లు, స్పోర్ట్స్, గేమ్స్, జాతీయ సేవా పథకం, ఇతర అంశాలు చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ధర్మాపురంలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్ఎం రాజేంద్ర ప్రసాద్

పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం

దేవరుప్పుల, జూన్ 20: ధర్మాపురం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన చిన్నారి విద్యార్థులకు గురువారం అక్షరాభ్యాసం చేయించారు. హెచ్ఎం ముడిదె రాము ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా, కామారెడ్డిగూడెం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ధర్మాపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం శివాజీ, ఉపాధ్యాయులు చల్లా విజయపాల్‌రెడ్డి, సరిత, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం పేదల పక్షాన నిలబడాలి

స్థలాలను ఇండ్లు లేని వారికి పంచాలి ■ సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

బచ్చన్నపేట, జూన్ 20: ప్రభుత్వం పేదల పక్షాన నిలిచి ఇండ్లు లేని పేదలకు స్థలాలు ఇప్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గోపాల్‌నగర్ ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 174లో గుడిసెవాసుల సమావేశం పర్వతం నర్సింహులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడాలన్నారు. ఆ స్థలాలను ఇండ్లు లేని పేదలకు పంచాలన్నారు. గోపాల్‌నగర్‌లో గుడిసెలు వేసు కున్న వారిని భయభ్రాంతులకు గురిచేయకుండా పేదల పక్షాన ప్రభుత్వం నిలబడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బెల్లంకొండ వెంకటేశ్, జిల్లా నాయకులు బూడిద గోపి, చుంచు విజేందర్, కరుణాకర్, యాదగిరి, రాములు, రాజవ్వ, కావ్య, శోభ, మమత, సౌందర్య, కవిత, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

జనగామలో విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



పాలకుర్తి కేజీబీవీలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ నల్ల నాగిరెడ్డి

నులి పురుగులను నిర్మూలించాలి

■ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
■ జిల్లావ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

జనగామ చౌరస్తా, జూన్ 20: బాలబాలికల్లో నులి పురుగులను నిర్మూలించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/కాలేజీలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలబాలికల్లో నులిపురుగుల నియంత్రణకు ఆల్బెండజోల్ మాత్రలతో అడ్డుకట్ట వేయొచ్చని అన్నారు. ఆరుబయట పిల్లలు మట్టిలో ఆడుకొని కాళ్లు-చేతులు శుభ్రపర్చుకోకుండా ఆహారం తీసుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయడం వల్ల ఈ పురు గులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. నులి పురుగుల సంక్రమణ చిన్నారుల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి వ్యాధి లక్షణాలను కలుగజేస్తాయని పేర్కొన్నారు. దీంతో పిల్లల్లో ఏకాగ్రత, నేర్చుకోగల సామర్థ్యం తగ్గుతుందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్, డీడబ్ల్యూవో జయంతి, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, డాక్టర్ రవీందర్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ శ్రీతేజ, సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్, జయపాల్‌రెడ్డి, రఫీక్, ఆర్బీఎస్కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులతో అనేక అనర్థాలు

దేవరుప్పుల: పిల్లల్లో నులిపురుగులు ఉంటే అనేక అనర్థాలకు కారణమవుతాయని మండల వైద్యాధికారి రవితేజ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలతో కడుపులో ఉన్న నులి పురుగులు నివారించబడతాయని, దీంతో రక్తహీనత తగ్గి పోషణ మెరుగవుతుందన్నారు. అనంతరం ఆల్బండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఆరోగ్య సిబ్బంది పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలు తిరిగి 5,837 మంది విద్యార్థులకు మాత్రలు వేసినట్టు డాక్టర్ రవితేజ తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సత్యనారాయణ, సంపూర్ణ, భాగ్యలక్ష్మి, శ్రీనాథ్, రామకృష్ణ ఉన్నారు.

కస్తూర్బా, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో..

పాలకుర్తి: మండల కేంద్రంలో కస్తూర్బా, సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో గురువారం ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జడ్పీటీసీ శ్రీనివాస్‌రావు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం ఎంపీపీ కస్తూర్బా బాలికల పాఠశాలలోని భోజనాన్ని పరిశీలించారు. సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్ఫూర్తి స్పందన, రమ, శ్రీనివాస్‌రావు, లెనిన్, ఏఎన్ఎంలు స్రవంతి, మానస, ఆశ కార్యకర్తలు కే సరిత, వీ సరిత, ఎంపీటీసీలు పుష్పలీల, పురుషోత్తం పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో..

బచ్చన్నపేట: కొడవటూరులోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి రూపాచైతన్య విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం తల్లితండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలక్ష్మి, శ్యామల, ఆశ వర్కర్లు అనిత, అనూష, పాఠశాల ఇన్‌చార్జి, ఉన్నత పాఠశాల హెచ్ఎంలు బాల మల్లయ్య, అరుంధతి పాల్గొన్నారు.

తరిగొప్పలలో..

తరిగొప్పుల : మండల కేంద్రంలోని కేజీబీవీలో డాక్టర్లు గాయత్రి, రఘులత, విద్యార్థినులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీబీ స్పెషల్ ఆఫీసర్ రజిత, అన్నపూర్ణ, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాత్రలను వేస్తున్న డాక్టర్ రఘులత

కొడవటూరులో మాత్రలు వేస్తున్న డాక్టర్ ఝాన్సీ, జేపీఎస్ రూపాచైతన్య

దేవరుప్పుల కేజీబీవీ విద్యార్థులకు నులిపురుగులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవితేజ

రైలు నుంచి పడి ఒకరి మృతి

రఘునాథపల్లి, జూన్ 20: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ఒకరు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో యశ్వంతాపూర్ గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నుం చి ప్రమాదవశాత్తు కిందపడడంతో సుమారు 30 సంవత్సరాలున్న గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుడి చెయ్యిపై శామన్‌లాల్ అని ఉందని, ముస్లిం కావచ్చని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాల కోసం 8121708796, 9010100958 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆలయ షెడ్ నిర్మాణానికి రూ. లక్ష విరాళం

బచ్చన్నపేట, జూన్ 20: రేణుకా ఎల్లమ్మ ఆలయం నిర్మాణంలో భాగంగా షెడ్ వేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవా సమితి చైర్మన్, సామాజిక సేవా కార్యకర్త కొత్తపల్లి సతీశ్ కుమార్ రూ. లక్ష నగదు విరాళం అందించారు. గురువారం హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లోని గణేశ్‌నగర్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయం ఎదురుగా రేకుల షెడ్ వేసేందుకు తనవంతుగా ఈ సాయం చేశానని తెలిపాడు. ఈ సందర్భంగా కమిటీ సతీశ్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

షెడ్ నిర్మాణానికి విరాళం అందిస్తున్న సతీశ్‌కుమార్

తండాలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలి

అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సేవాలాల్ సేన నాయకులు

జనగామ చౌరస్తా, జూన్ 20: తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేస్తూ గురువారం జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ (స్థానిక సంస్థలు)కు సేవాలాల్ సేన జిల్లా కమిటీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సేన జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్గంలో బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లుగా గిరిజనుల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. తండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్టీ కమిషన్, ట్రైబల్ అడ్వైజరీ కమిటీని నియమించాలని కోరారు. మైదాన ప్రాంత గిరిజనులకు ప్రత్యేక ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 25 శాతం సీట్లను ఉచితంగా ఇచ్చేలా ఆదేశా లు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా నాయకులు మహేందర్, రాజు, అశోక్, సుమన్, రాజన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే కడియం

జఫర్‌గఢ్/రఘునాథపల్లి/ చిల్పూరు, జూన్ 20: జఫర్‌గఢ్ మండలంలోని తమ్మడ పల్లి(ఐ) గ్రామానికి చెందిన నాగపురి సాంబకుమార్ అనారోగ్యం బారిన పడగా, వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని ఆయన కుటుంబసభ్యులకు గురువారం స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనితాసుధాకర్ బాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా రఘునాథపల్లిలో పేర్నె జ్యోతి, భాంజీపేటలో గొరిగే భిక్షపతి, అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు మారుజోడు రాంబాబు, లింగాల జగదీశ్ చందర్‌రెడ్డి, జిల్లా నాయకులు గొరిగె రవి, కృష్ణ, లోనె శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే కడియం, ఎంపీ కవితను చిల్పూరు మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన రైతులు హనుమకొండలోని వారి నివాసంలో కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. తమకు 1990లో నాటి రాష్ట్ర ప్రభుత్వం సర్వే నంబర్లు 63, 69లో ఎకరం చొప్పున భూమిని పంపిణీ చేసి పట్టాలిచ్చిందని, అలాగే గ్రామంలోని 40 మందికి ఎకరం చొప్పున ఇచ్చిందని రైతులు చేరాల పోషయ్య, నీల సాయవ్వ, నీల కనకవ్వ తెలిపారు. బతుకు దెరువు కోసం కొద్ది రోజుల క్రితం వేరే ఊరికి వెళ్లడంతో తమ భూమిని గ్రామానికి చెందిన కొందరు నాయకులు తప్పుడు పత్రాలు సృష్టించి ఇతరులకు విక్రయించారని, తమకు నాయ్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు మాలోత్ రాజు, గ్రామశాఖ అధ్యక్షుడు పోలబోయిన నరేశ్, నియోజకవర్గ సోషల్ మీడియా రంగు రమేశ్, నాయకులు నీల కరుణాకర్, మోతె మహేశ్, ఉపేందర్, పల్లపు కనుకయ్య, పిట్టల రాజుకమార్, పిట్టల వెంకన్న, మాలోత్ జంపరాజు, తుపాకుల శంకర్, సురేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రోడ్డిలా.. ప్రయాణమెలా ?

■ కోతకు గురైన వెల్దండ-నర్మెట రహదారి
■ ప్రమాదం జరిగితే బాధ్యులెవరు ?
■ రోడ్డు నిర్మించాలని కోరుతున్న స్థానికులు

నర్మెట, జూన్ 20: వెల్దండ- నర్మెట రోడు ప్రమాదకరంగా మారింది.. కోతకు గురికావడంతో ఈ రహదారిపై ప్రయాణం ఎలా చేయాలని ప్రజలు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారి రెండు జిల్లాలను, బచ్చన్నపేట, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలాలను కలుపుతున్నది. గత ప్రభుత్వ హయాంలో గోదావరి జలాలను విడుదల చేయడంతోపాటు వర్షపు నీరు రావడంతో వెల్దండ గ్రామంలోని నాగుల చెరువు నిండి మత్తడి ఉధృతంగా ప్రవహించింది. దీంతో మ త్తడిపైన ఉండే రోడ్డు పూర్తిగా ధ్వంసమై తెగిపోయింది. అప్పుడు తాత్కాలికంగా అధికారులు మరమ్మతులు చేపట్టి మట్టిని పోశారు. దీంతో వర్షం వచ్చిన్నప్పడల్లా రోడ్డుపై ఉన్న మట్టి కొట్టుకుపోతోంది. ఈ దారి గుండా నిత్యం మండల కేంద్రానికి అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి తోడు రోజూ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో చదివే విద్యార్థులు ఈ దారి గుండానే వెళ్తారు. రోడ్డు దెబ్బతినడంతో ఈ దారి వెంట వెళ్లే వారు భయాందోళన చెందుతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండి ఒకే వాహనం వెళ్లేలా ఉంది. రాత్రి వేళలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తప్పేటట్లు లేదు. ఇక్కడ హైలెవల్ బ్రిడ్జితో పాటు శాశ్వత పరిష్కారం చేపట్టి నూతన రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారిన రోడ్డు

మహిళలకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

డీలక్స్ బస్సుల్లో ప్రయాణిస్తే లక్కీడ్రా ద్వారా బహుమతులు

జనగామ, జూన్ 20(నమస్తే తెలంగాణ)/జనగామ చౌరస్తా : మహిళలకు ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కాకుండా డీలక్స్ బస్సుల్లో టికెట్లు కొని ప్రయాణించే మహిళలకు లక్కీడ్రా ద్వారా బహుమతులు అందిస్తామని డిపో మేనేజర్ జోత్స్న ఒక ప్రకటన లో తెలిపారు. ఉప్పల్ నుంచి హనుమకొండ రూట్‌లో నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సులకు రద్దీ పెరిగి నిలబడే స్థలం కూడా లేకపోవడంతో జనగామ డిపో అదనంగా 3 డీలక్స్ బస్సులను నడుపుతుండటంతో అదనంగా ఆదాయం వస్తున్నది. మహిళలు డీలక్స్ బస్సుల్లో టికెట్లు కొని ప్రయాణించేలా ఆర్టీసీ ప్రత్యామ్నాయ చర్యలు తీసు కుంటున్నది. ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు డీలక్స్ బస్సుల్లో మహిళలు తీసుకునే టికెట్లను ప్రతి 15 రోజులకు ఒకసారి లక్కీడ్రా తీస్తామని ప్రకటించారు. మహిళా ప్రయాణికులు తమ టికెట్‌పై పేరు, అడ్రస్, సెల్ నంబర్ రాసి డీలక్స్ బస్సుల్లో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలని డీఎం సూచించారు. జూన్ 16 నుంచి 30వ తేదీ వరకు ప్రయాణించే వారి టికెట్లను జూలై 1న లక్కీడ్రా తీస్తామని, ఇలా ప్రతి 15రోజుల కోసారి డ్రా తీసి ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులు అందిస్తామని డీఎం వెల్లడించారు.

నినాదాలు చేస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు

ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి

గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల నిరసన

నర్మెట, జూన్ 20: గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని కోరుతూ గురువారం భోజన విరామ సమయంలో నర్మెటలోని పాఠశాల ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్యా వాసు మాట్లాడుతూ గత 12, 13 సంవత్సరాలుగా ఒకే పాఠశాలలో పనిచేస్తూ అనేక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. వెంటనే ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ విడుదల చేయకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భూక్యా కృష్ణ, సునీత, వినోద, సమ్మక్క, సజన్‌లాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూలో యోగా డే

హనుమకొండ చౌరస్తా, జూన్ 20 : కేయూ జాతీయ సేవా పథకం, విశ్వవిద్యాలయ యోగా సెంటర్ సంయుక్త నిర్వహణలో శుక్రవారం ఉదయం 6 గంటలకు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ' నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి, గౌరవ అతిథులుగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, దూరవిద్య కేంద్ర సంచాలకులు రామచంద్రం, స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి వెంకయ్య, యోగా సెంటర్ సంచాలకులు జ్యోతి పాల్గొంటారన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రఘునాథపల్లి, జూన్ 20 : భార్య గొడవపడి వెళ్లిపోగా భర్త ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అశ్వరావుపల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్పిడి వెంకటయ్య(43), సునీత దంపతులకు కుమారుడు అఖిల్, కుమార్తె అనూష ఉన్నారు. వీరు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో సునీత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారి ఇంట్లో వెతికినా కనిపించకపోవడంతో మనస్తాపం చెందిన వెంకటయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి పక్కన ఉన్నవారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు.

నిట్ ముగింపు ప్రోగ్రాంలో విద్యార్థులతో ప్రొఫెసర్ సోమశేఖర్

నిట్‌లో ముగిసిన ఇంటర్న్‌షిప్

హనుమకొండ చౌరస్తా, జూన్ 20 : నిట్‌లో బోయింగ్ స్పాన్సర్ చేసిన 'ఏఐవోటీ ఇట్స్ అప్లికేషన్స్'పై వేసవి ఇంటర్న్‌షిప్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రిసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ (ఆర్ అండ్ సీ) డీన్ ప్రొఫెసర్ వీటీ సోమశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ రవి కుమార్, 120కిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (లాట్) వారి అప్లికేషన్లపై ఫ్యాకల్టీ సభ్యులు వివరించారు. ఇంటర్న్‌షిప్ చివరి రోజు విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇంటర్న్‌షిప్‌ను స్పాన్సర్ చేసినందుకు బోయింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రొఫెసర్ సోమశేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గూడూరులో వీరగల్లు శిల్పం

గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

పాలకుర్తి, జూన్20: మండలంలోని గూడూరులో వీరగల్లు శిల్పాన్ని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. దానికి సంబంధించిన వివరాలను గురువారం వెల్లడించారు. గ్రామ, పశువుల రక్షణలో ప్రాణాలు పోగొట్టుకున్న వీరుల త్యాగాలను గుర్తు చేసుకోవడానికి స్థానికులు విగ్రహంగా నిలుపుకొని గతంలో పూజించే వారన్నారు. గూడూరులోని పోచమ్మ గుడి సమీపంలో 12 లేదా13వ శతాబ్ద కాలం నాటి వీరగల్లు శిల్పం ఉందన్నారు. వెడల్పైన ముఖం, గుండ్రంగా వేసి న సిగ, ముడి చెవికి కుండలాలు, కంఠాభరణం, గోచి కట్టుకొని ఉన్నాడని ఆయన తెలిపారు. రెండు చేతుల్లో ఈటె ధరించారని పేర్కొన్నారు. వీరుడి విగ్రహం సమీపంలో భూమిలో కూరుకొని ఉన్న వినాయక విగ్రహం ఉందన్నారు. వీటి తో పాటు గ్రామంలో పూజ కు నోచుకోని విగ్రహాలన్నింటిని ఒక దగ్గర పెడితే మ్యూ జియంగా తయారవుతుందని ఆయన తెలిపారు. ఈ దిశలో గ్రామ పంచాయతీ అధికారులు, గూడూరు చైతన్య వేదిక సభ్యులు చర్యలు తీసుకోవాలని రెడ్డి రత్నాకర్‌రెడ్డి కోరారు.

వీరగల్లు శిల్పాన్ని చూపిస్తున్న చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

లీజు/ కిరాయి

★ HNK, అదాలత నుండి K.L.N. రోడ్‌కు వెళ్ళే మెయిన్ రోడ్, (S.V.కాలనీ) రోడ్ నెం.5, 1st, 2nd, 3rd అంతస్థుల భవనం 1650Sft కిరాయికి/ లీజు ఇవ్వబడును. (న్యూ బిల్డింగ్) సంప్ర ।। 9502879612.
KMM_11687

PASSPORT MISSING
★I, ALIZAH, D/o. Late. MOHAMMED MANSOOR ALI, Age: 19 yrs, Lost my Passport No. M4450978, while travelling on 14-6-2024 by Auto Rickshaw from Subedari to Kazipet of Hanmakonda District. and I am unable to trace is and it is lost, If anyone see my Passport please inform R/o. H.No. 35-2-613, Balaji Colony, Road No.1, Gopalpuram, Hanamkonda, Hanumakonda Dist.-506001.
NTW-00

PASSPORT MISSING
★I, AMENA, D/o. Late. MOHAMMED MANSOOR ALI, Lost my Passport No. K8423239, while travelling on 14-6-2024 by Auto Rickshaw from Subedari to Kazipet of Hanmakonda District. and I am unable to trace is and it is lost, If anyone see my Passport please inform R/o. H.No. 35-2-613, Balaji Colony, Road No.1, Gopalpuram, Hanamkonda, Hanumakonda Dist.-506001.
NTW-00

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma